ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 39.0 కనిష్ఠం : 26.0
ANDHRAJYOTHY 5 అనంతపురం
జిల్లా వార్తలు
ఆదివారం 4 మే 2025

మాయ

అది అంతే..!
మాయ చేస్తుంది..
మంత్రం వేస్తుంది..
పదే పదే చూసుకున్నా..
ఇంకోసారి
చూడమంటుంది..
పడిపోతే అంతే..!
పనీపాట మానేసి..
ఊహల్లో తేలిపోవాలంతే..
నీదే అందం అన్నట్లు..
అరచేతి మందం ఉన్నట్లు..!
- ఆంధ్రజ్యోతి, అనంతపురం


● మీసాలు వచ్చినట్లుందాయే..


● కోతిగా పుట్టాంగానీ.. లేకుంటే మనం హీరోనే..


● ఈ అద్దంలోనూ అంతే..! ఇంతందంగా పుట్టావేంట్రా..?


● దేవుడికి మనసు లేదు గురూ..! లేకుంటే మనం కోతేమిటి..!

డబ్బా కథ..!

● ప్రతినెలా 20టన్నులకు పైగా...
● ఖాళీ డబ్బా బరువే 1530 గ్రాములు
● రేషన్ లబ్ధిదారులకు డీలర్ల బురిడీ

డబ్బాతో చౌక డిపోల్లో బియ్యం దోపిడీ



యాడికి, మే 3(ఆంధ్రజ్యోతి): డబ్బా మాటున రేషన్‌షాపుల్లో బియ్యం దోపిడీ జరుగుతోంది. డబ్బా బరువును తీసేయకుండా తూకం వేసి లబ్ధిదారులకు సరుకులు అంటగడుతున్నారు. మండలంలో 35 చౌక డిపోలు ఉన్నాయి. 16476 రేషన్ కార్డులు ఉన్నాయి. ఒక్కో కార్డుకు బియ్యం తూకం వేసిన ప్రతిసారీ 1530గ్రాములు కాజేస్తున్నారు. ఈ లెక్కన మండలంలో ప్రతినెలా సగటున 20 టన్నుల బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి డీలర్లు దోచేస్తున్నారు. గత నెల నాలుగో తేదీన రేషన్ దుకాణాల తనిఖీకి వెళ్లిన తూనికలు, కొలతలశాఖ అధికారి డబ్బాతో బియ్యం వేస్తుండటాన్ని పరిశీలించి అవాక్కయ్యారు. ఖాళీ డబ్బాను తూకం వేశాడు. బరువు 1530గ్రాములు ఉండటం చూసి డీలర్లపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఒక్కో కార్డుకు బియ్యం వేసిన ప్రతిసారీ 1530గ్రాముల బియ్యాన్ని మీరు దోపిడీ చేస్తున్నారా అని ప్రశ్నించాడు. దీనికి సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన రేషన్ డీలర్లు రాజకీయ నాయకులతో ఫోన్లు చేయించి చూసీచూడనట్లు వదిలేయమని చెప్పించడం గమనార్హం. రాజకీయ ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో ఆ అధికారి డీలర్లను హెచ్చరించి వెళ్లిపోయాడు.

డబ్బాపై సాకులు


డబ్బా బరువే 1530 గ్రాములు

రేషన్ దుకాణాలకు సరఫరా చేసే బియ్యం బస్తాలు తక్కువ తూకాలతో వస్తున్నాయి. తేడా వస్తున్న బియ్యాన్ని తాము ఎక్కడి నుంచి తేవాలని రేషన్ డీలర్లు ప్రశ్నిస్తున్నారు. స్టాక్ గోడౌన్ వద్ద కచ్చితమైన తూకాలతో బియ్యం బస్తాలను సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. డీలర్లకు సందేహాలు ఉంటే రేషన్ దుకాణాలకు స్టాక్ పంపే సమయంలో గోడౌన్ వద్దకు వచ్చి సరి చూసుకోవచ్చునని చెబుతున్నారు. పౌరసరఫరాల అధికారులు, రేషన్‌డీలర్ల మధ్య అవగాహన రాహిత్యంతో రేషన్ లబ్ధిదారులు దోపిడీకి గురవుతున్నారు. కాగా చౌక డిపోలో డబ్బా పెట్టకుండా బియ్యం వేయాలని కొందరు లబ్ధిదారులు అడిగితే డీలర్లు కసురుకుంటున్నట్లు సమాచారం. బియ్యం ఇచ్చేటపుడే తమకు తక్కువ ఇస్తున్నారని, ఇప్పుడు తాము తక్కువ వస్తున్న బియ్యాన్ని ఎక్కడి నుంచి తేవాలని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. 'ఇష్టముంటే వేయించుకోండి లేకపోతే లేదు' అని పలువురు డీలర్లు హూంకరిస్తున్నట్లు సమాచారం.


రేషన్ షాపు వద్ద లబ్ధిదారుల ఎదురుచూపులు

విచారించి చర్యలు తీసుకుంటాం

రేషన్ దుకాణాల్లో డబ్బాతో బియ్యం తూకం వేయకూడదు. దీనిపై మాకు ఎటువంటి ఫిర్యాదులు అందలేదు. ఎవరైనా ఫిర్యాదుచేస్తే విచారించి తగు చర్యలు చేపడతాం. ప్రతిరేషన్ దుకాణం డీలర్ లబ్ధిదారులకు కచ్చితమైన తూకాలతో రేషన్ సరుకులు పంపిణీ చేయాలి. ఎండీయూ వాహనాల ద్వారానే రేషన్ పంపిణీ చేయాలి. ప్రభుత్వ నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం.

-సూర్యనారాయణ, ఇన్‌చార్జ్ సీఎస్‌డీటీ

కిలోన్నరకు పైగా కొట్టేస్తున్నారు



రేషన్ దుకాణంలో బియ్యం డబ్బాతోనే వేస్తున్నారు. ఒకసారి బియ్యం వేసినప్పుడు కిలోన్నరకుపైగా డీలర్లు కొట్టేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు నష్టపోవాల్సి వస్తోంది. డబ్బా లేకుండా బియ్యాన్ని వేయాలని అడిగితే అందరికి ఇలాగే వేస్తున్నాము నీకు ఇష్టం ఉంటే వేయించుకో, లేదంటే మరో రేషన్ దుకాణంలో తీసుకోపో అంటున్నారు. డబ్బాల విషయం అధికారులు అందరికి తెలిసినా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఎండీయూ వాహనాలు ఉన్నప్పటికి ఆపరేటర్లను రేషన్ దుకాణంలో ఉంచుకొని, అక్కడే రేషన్ పంపిణీ చేస్తున్నారు.

- చౌడయ్య, రేషన్ లబ్ధిదారుడు, యాడికి

డబ్బా బరువు 1535గ్రాములు ఉంది



ఇటీవల యాడికిలో రేషన్ దుకాణంలో తనిఖీ చేసినప్పుడు తూకాల్లో తేడా ఉన్న మాట వాస్తవమే. బియ్యం వేసే సమయంలో డబ్బా వాడుతున్నారు. ఖాళీ డబ్బా బరువు చూస్తే 1535గ్రాములు ఉంది. ఇలా తూకం ఎలా వస్తారు అని ప్రశ్నిస్తే రేషన్ డీలర్ల వద్ద సమాధానం లేదు. రేషన్ దుకాణాల్లో తూకాలు ఇలాగే పునరావృతం చేస్తే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తాం.

-వైజీ శంకర్, తూనికలు కొలతలశాఖ అధికారి, గుంతకల్లు డివిజన్

స్వీపర్‌పై మూట మాయం కేసు

ఉరవకొండ, మే 3(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిలంలో హుండీ లెక్కింపు సమయంలో నగలు మూట మాయం వ్యవహారంలో స్వీపర్ శ్రీనివాసులుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈవో రమేష్‌బాబు స్వీపర్‌పై ఫిర్యాదు చేశారని సీఐ మహానంది తెలిపారు. ఆలయంలో మార్చి 18న హుండీ సొమ్ము లెక్కింపు చేపట్టారు. ఆ సమయంలో ఓ భక్తురాలు నిలువు దోపిడీ సమర్పించి, హుండీలో వేసిన బంగారు ఆభరణాల మూటను స్వీపర్ ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అర్చకుడు గమనించడంతో విషయం వెలుగులోకి వచ్చిందని, నగలను కాజేయలన్న ఉద్దేశంతోనే స్వీపర్ ఇలా చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీసీ కెమెరాలను పరిశీలించి, స్వీపర్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించి ఫిర్యాదు చేశారని సీఐ తెలిపారు.

పంటలు నేలపాలు

● మళ్లీ దెబ్బకొట్టిన గాలివాన ● వరి, అరటి, మామిడి రైతులకు భారీ నష్టం

శింగనమల మండలం సి. బండమీదపల్లి వద్ద ఈదురుగాలులకు నేలకొరిగిన వరి పంట



అనంతపురం అర్బన్/నెట్‌వర్క్, మే 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో శుక్రవారం రాత్రి గాలివానకు అరటి, మామిడి, వరి, మొక్కజొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయి. అనంతపురం జిల్లాలో 132.61 హెక్టార్లల్లో రూ.2.01 కోట్ల విలువైన పంట నష్టం జరిగింది. వివిధ మండలాల్లో 102 మంది రైతులకు సంబంధించి 88.61 హెక్టార్లల్లో రూ.1.63 కోట్లు విలువైన అరటి, మామిడి, బొప్పాయి, మునగ పంటలు దెబ్బతిన్నాయి. శింగనమల మండలంలో 77 మంది రైతులకు సంబంధించి 44 హెక్టార్లల్లో రూ.38 లక్షల విలువైన మొక్కజొన్న, వరి పంటలు దెబ్బతిన్నాయి. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ, కొత్తచెరువు, కదిరి మండలాల్లో 19 మంది రైతులకు చెందిన 20 హెక్టార్లలో మొక్కజొన్న పంట దెబ్బతింది. రూ.3 లక్షల దాకా నష్టం జరిగిందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుబ్బారావు తెలిపారు. కొత్తచెరువు మండలం తలమర్లలో రైతు వెంకటరెడ్డి రెండు ఎకరాలలో, కేశాపురంలో ఓబులమ్మ ఒకటిన్నర ఎకరంలో సాగు చేసిన మొక్కజొన్న దెబ్బతింది. మామిడితోటలు సుమారు 400 ఎకరాలలో దెబ్బతిన్నాయి. రూ.20లక్షల దాకా నష్టం జరిగిందని ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. బుక్కపట్నం మండలం సిద్దారాంపురంలో ఇద్దరు రైతులకు చెందిన ఐదు ఎకరాలలో అరటి పంట దెబ్బతిని రూ.2.50 లక్ష వరకు నష్టం జరిగిందని తెలిపారు. బుక్కపట్నం మండలంలో మామిడి పంట ఎక్కువగా దెబ్బతిందని, ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు.


రాప్తాడు మండలం చెర్లోపల్లిలో నేలకొరిగిన అరటి

23 మండలాల్లో వర్షం

అనంతపురం జిల్లాలోని 23 మండలాల్లో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అత్యధికంగా శింగనమల మండలంలో 42.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. శెట్టూరులో 24.2, వజ్రకరూరు 17.2, రాప్తాడు 16.2, బుక్కరాయసముద్రం 14.2, బొమ్మనహాళ్ 13.2, డి.హీరేహాళ్, కణేకల్లు, ఉరవకొండ మండలాల్లో 10, పెద్దపప్పూరు 9.8, గుమ్మఘట్ట 8.2, నార్పల 5.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

దెబ్బతిన్న అరటి

● అనంతపురం రూరల్ మండలం చియ్యేడు, పూలకుంటలో రెండు అరటి తోటలు దెబ్బతిన్నాయి. ఉప్పరపల్లిలో రెండు ఎకరాలు, మన్నీలలో ఇద్దరు రైతులకు సంబంధించి 4.5 ఎకరాల్లో అరటి పంట దెబ్బతినింది. నష్టాన్ని అంచనావేసి జిల్లా (మిగతా 6వ పేజీలో..)


మరమ్మతుల తరువాత రేంజర్ కార్యాలయం..

ఓ రేంజ్‌లో..!

రేంజర్ కార్యాలయానికి హంగులు
కార్పొరేట్ కార్యాలయంలా ముస్తాబు

అనంతపురం న్యూటౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లా అటవీశాఖ కార్యాలయం సమీపంలో ఉన్న అనంతపురం రేంజర్ కార్యాలయాన్ని అహో.. అనే రీతిలో తీర్చిదిద్దుతున్నారు. నూతన హంగులు అద్దుతున్నారు. ఓ రేంజ్‌లో ముస్తాబు చేస్తున్నారు. మరమ్మతులు చివరి దశకు చేరుకున్నాయి. సీఎఫ్ యశోదాబాయి ఈనెల 7న ప్రారంభించనున్నారు. రేంజర్ కార్యాలయంలో 8 గదులున్నాయి. రేంజర్ చాంబర్, కంప్యూటర్ ఆపరేటర్ గది మాత్రమే వినియోగంలో ఉండేవి. మిగిలినవన్నీ సీజ్ చేసిన కలప, బూజు పట్టిన ఫైళ్లతో నిండి ఉండేవి. రెండేళ్ల క్రితం పీసీసీఎఫ్ మధుసూదన్ రెడ్డి జిల్లాకి వచ్చారు. కార్యాలయ ఆవరణం మొత్తం కలియతిరిగారు. రేంజర్ కార్యాలయంలో నిలువ చేసిన కలప, నిరుపయోగంగా ఉన్న బూజుపట్టిన రికార్డుల గదితోపాటు నిరుపయోగంగా ఉన్న బీట్ ఆఫీసర్ బంగ్లాను పరిశీలించారు. అపరిశుభ్రతపై అప్పటి డీఎఫ్ఓ సందీప్‌కుమార్‌ను హెచ్చరించారు. వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశించారు. అప్పట్లో పట్టించుకోలేదు. ఇటీవల రూ.5 లక్షలతో మరమ్మతులు చేపట్టారు. మూడు నెలల్లోనే పూర్తి చేశారు. ప్రత్యేక హంగులతో రేంజర్ కార్యాలయాన్ని కార్పొరేట్ ఆఫీసును తలదన్నేలా సిద్ధం చేశారు.

కార్యకర్తలకు టీడీపీ అండ: దగ్గుపాటి


కార్యకర్త భార్యకు బీమా ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఎ.నారాయణపురం పంచాయతీలో టీడీపీ కార్యకర్త నరసింహులు కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించారు. బైక్‌పై వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొని నరసింహులు రెండు నెలల క్రితం మృతి చెందారు. అంతకు రెండు నెలల క్రితం ఆయన టీడీపీ సభ్యత్వాన్ని రెన్యువల్ చేయించుకున్నారు. పార్టీ సభ్యత్వం ఉన్నవారికి టీడీపీ బీమా చేయించిన విషయం తెలిసిందే. దీంతో నరసింహులు కుటుంబానికి బీమా అందేలా ఎమ్మెల్యే చొరవ తీసుకున్నారు. ఇటీవల నరసింహులు భార్య బ్యాంకు ఖాతాలో బీమా సొమ్ము రూ.5 లక్షలు జమ అయింది. బీమా ధ్రువపత్రాన్ని బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు. కేవలం రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకున్నందుకు కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షలు బీమా వచ్చిందని తెలిపారు. పార్టీ కార్యకర్తల కోసం మంత్రి నారా లోకేశ్ తీసుకున్న చొరవ దేశంలో ఏ నాయకుడూ తీసుకోలేదని కొనియాడారు. దేశంలో ఏ ప్రాంతీయ పార్టీకీ కోటి సభ్యత్వాలు లేవని, అది టీడీపీకే సాధ్యమైందని అన్నారు. అర్బన్ నియోజకవర్గంలో 70వేలకుపైగా సభ్యత్వాలు నమోదు చేశామని తెలిపారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ, తాను అండగా ఉంటామని అన్నారు.

పంటలు నేలపాలు


ధర్మవరం: బుడ్డారెడ్డిపల్లిలో నేలరాలిన మామిడికాయలు


అనంతపురం రూరల్: ఉప్పరపల్లిలో నేలకొరిగిన అరటి


బుక్కపట్నంలో నేలరాలిన మామిడిని చూపుతున్న రైతు

(5వ పేజీ తరువాయి)

అధికారులకు నివేదిక ఇచ్చామని మండల ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్ తెలిపారు.

● రాప్తాడు మండలం ఎం. చెర్లోపల్లిలో హనుమంతరాయుడు 4 ఎకరాలు, నారాయణప్ప 5 ఎకరాలలో సాగు చేసిన అరటి పంట నేలకొరిగింది.

నేలరాలిన మామిడి

● బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లి, సిద్దరాంపల్లి, నారసింహపల్లి, గూనిపల్లి, మారాల, పాముదుర్తి, కొత్తకోట తదితర గ్రామల్లో దాదాపు 500 ఎకరాల్లో మామిడికాయలు నేలరాలాయి.

● ధర్మవరం మండలం బుడ్డారెడ్డిపల్లిలో డి.నారాయణరెడ్డి, సంజీవులు తోటలో మామిడి కాయలు రాలిపోయాయి. గొట్లూరులో అరుణశ్రీ సాగుచేసిన అరటితోట నేలకొరిగింది. బడన్నపల్లి ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభం కూలిపోయింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

కూలిన పాఠశాల గదులు

చెన్నేకొత్తపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు గదులు వర్షానికి శనివారం కుప్పకూలాయి. వేసవి సెలవులు కావడంతో విద్యార్థులకు పెద్ద ప్రమాదమే తప్పింది. సైన్స్‌ల్యాబ్ గది, 3వ తరగతి గది శిథిలావస్థకు చేరాయని, దీంతో వేరే గదుల్లోకి మార్చామని హెచ్‌ఎం ఓబులమ్మ తెలిపారు. ల్యాబ్‌లో పరికరాలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళతామని అన్నారు.


చెన్నేకొత్తపల్లిలో కూలిన పాఠశాల తరగతి గదులు

వరి రైతుకు నష్టం


సి.బండమీదపల్లి వద్ద ఈదురుగాలులకు నేలమట్టమైన వరి పంట

శింగనమల మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలో వేలాది ఎకరాల్లో వరి పంట నేలమట్టమైంది. కోతకోసి ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. నష్టం రూ.కోట్లలో ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శింగనమల శ్రీరంగరాయని చెరువు కింద రెండు వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వరి సాగు చేశారు. కోత సమయం కావడంతో మడులను ఆరబెట్టారు. గాలివాన దెబ్బకు శుక్రవారం రాత్రి 90 శాతం పంట నేల మట్టమైంది. తడి ఆరేదాకా కోత కోయడం సాధ్యం కాదని, ఈలోగా ధాన్యం మొలకెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. శివపురం, సి.బండమీదపల్లి, పోతురాజు కాల్వ గ్రామాల పరిధిలో 50 శాతం పంట కోత కోసి, ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. తరిమెల, కల్లుమడి, గుమ్మేపల్లి రాచేపల్లి, నిదనవాడ, ఉల్లికల్లు, జూల్యాకాలువ గ్రామాల పరిధిలో 75 శాతానికి పైగా వరి పంటను కోశారు. పొలాల్లో ఆరబెట్టిన పశుగ్రాసం తడిసిపోయింది. పశువులకు మేత లేకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొలకెత్తే ప్రమాదం..



రెండు ఎకరాల్లో వరి సాగు చేశాను. పంట కోయడానికి మడి ఆరబెట్టాను. గాలివానకు పంట నేల మట్టమైంది. కోత మిషన్ రావడానికి ఇంకా వారం పడుతుంది. మడిలో నీరు నిలిచినందున ధాన్యం మొలకెత్తే ప్రమాదం ఉంది. పంట సాగుకు రూ.70 వేలు ఖర్చు చేశాను. నయాపైసా కూడా చేతికి వచ్చేలా లేదు. **-వడ్డే ఆదెప్ప, సి.బండమీదపల్లి**

తడిసిన ధాన్యాన్ని కొనరు..



ఐదు ఎకరాల్లో వరి పంటను కోత కోశాను. వడ్లను మడిలోనే రాశిగా పోశాను. వర్షానికి ధాన్యం మొత్తం తడిసిపోయింది. రూ.2 లక్షలు వరకు ఖర్చు చేశాను. తడిసిన ధాన్యాన్ని కొనేందుకు వ్యాపారులు ముందుకు రారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

- వెంకటసుబ్బయ్య, సి.బండమీదపల్లి

ఏటా నష్టమే..



వరి పంటను శనివారం కోయించాలని మిషన్ తెప్పించాను. శుక్రవారం రాత్రి గాలివానకు పంట నేల మట్టం అయింది. ప్రతి సంవత్సరం ఇలాగే నష్టపోతున్నాను. పంటలు సాగు చేయాలంటే భయంగా ఉంది.

-టోపీసాబ్, సి.బండమీదపల్లి

వర్షం ముంచేసింది..



అప్పు చేసి ఐదు ఏకరాల్లో వరి సాగు చేశాను. దిగుబడి బాగా వచ్చింది. రెండు మూడు రోజులలో పంటను కోద్దామని అనుకున్నాను. గాలివానకు మొత్తం నేలవాలింది. నీరు ఇంకిపోయేలోగా ధాన్యం మొలకెత్తుతుంది. రూ.2 లక్షలకుపైగా పెట్టుబడి నష్టపోయాను.

-తలారి నాగేంద్ర, శింగనమల

ఆదుకుంటాం..

గాలివానకు వరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులను క్షేత్రస్థాయికి పంపించాము. పంట నష్టాన్ని అంచనావేసి నివేదిక ఇస్తారు. ప్రభుత్వం ద్వారా బాధిత రైతులను ఆదుకుంటాము. **-బండారు శ్రావణిశ్రీ, ఎమ్మెల్యే**

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి


మారుతీప్రసాద్ (ఫైల్)

గాండ్లపెంట, మే 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని చిన్నమిట్ట వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనం బోల్తాపడిన ప్రమాదంలో ఆటోడ్రైవర్ మారుతీప్రసాద్ (36) మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన మారుతీ ప్రసాద్ ఆటో తోలుతూ జీవనం సాగిస్తుండేవాడు. శుక్రవారం పనిమీద కదిరికి వెళ్లాడు. రాత్రి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో తిరుగు ప్రయాణమయ్యాడు. చిన్నమిట్ట వద్ద గేదెలను తప్పించే ప్రయత్నంలో బైక్ బోల్తాపడింది. మారుతీప్రసాద్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, బంధువులు వెంటనే 108 వాహనంలో కదిరికి తరలించారు. అప్పటికే మారుతీప్రసాద్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతడికి భార్య సుజాత, ఇద్దరు కుమారులు ఉన్నారు. సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్ తెలిపారు.

ప్రాణంతీసిన ఫోన్ వ్యసనం

● మొబైల్, ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

అనంతపురం క్రైం, మే3(ఆంధ్రజ్యోతి): మొబైల్, ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై ఓ బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని మున్నానగర్‌కు చెందిన కల్లూరు చంద్రకాంత్(20) స్థానిక ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతుండేవాడు. కళాశాలకు సరిగా వెళ్లకుండా మొబైల్ చూస్తూ, అందులో గేమ్స్ ఆడుతుండేవాడు. ఈ విషయంపై తల్లిదండ్రులు మందలించారు. ఈ క్రమంలో శనివారం తల్లిదండ్రులు బయటికెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో ఉరేసుకుని, చంద్రకాంత్ ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు రైతుల ఆత్మహత్య


సామ్లు (ఫైల్)


శర్మస్ వలి(ఫైల్)

ఆత్మకూరు, ఉరవకొండ, మే 3(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక జిల్లాలో శనివారం ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్ద తండాకు చెందిన సామ్లు నాయక్(40), ఆత్మకూరు మండలం ముట్టాల గ్రామానికి చెందిన శర్మస్ వలి(49) ఉరి వేసుకున్నారు. సామ్లునాయక్‌కు నాలుగు ఎకరాల పొలం ఉంది. అందులో వేరుశనగ సాగు చేసేవాడు. సరైన దిగుబడులు రాక తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు రూ.8 లక్షలకు పైగా పేరుకుపోయాయి. దీంతో దిక్కుతోచక ఇంట్లో ఉరి వేసుకున్నాడు. ఆయన భార్య సోముబాయి, నలుగురు పిల్లలు ఉన్నారు. శర్మస్ వలి కౌలు రైతు. ఐదెకరాలను కౌలుకు తీసుకుని కంది, వేరుశనగ సాగు చేసి నష్టపోయాడు. అప్పులు రూ.5 లక్షలకు పైగా ఉన్నాయి. సేద్యం గిట్టుబాటు కాకపోవడంతో కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకునేవాడు. కానీ అప్పుల ఒత్తిడి పెరగడంతో ఇంట్లో ఉరి వేసుకున్నాడు. ఆయనకు భార్య ఫాహిద, కూతురు ఉన్నారు. పోలీసులు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చీనీ టన్ను రూ.20వేలు

అనంతపురం రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 588 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.


గ్రూప్-1 అభ్యర్థులను తనిఖీ చేసి లోపలికి పంపుతున్న పోలీసులు


పరీక్షరాసి బయటకు వస్తున్న దివ్యాంగ అభ్యర్థులు

తొలిరోజు ప్రశాంతం

● గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ప్రారంభం
● 205 మంది గైర్హాజరు

అనంతపురం టౌన్, మే3(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు శనివారం మొదలయ్యాయి. తొలిరోజు ప్రశాంతంగా సాగాయి. వారంరోజులుపాటు జరిగే పరీక్షలను జిల్లాకేంద్రంలోని పీవీకేకే, శ్రీబాలాజీ పీజీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్షలు కొనసాగాయి. 594మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా.. 389 మంది రాశారు. 205 మంది గైర్హాజరయ్యారని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. కేంద్రాలవద్ద భారీ పోలీసు భద్రత ఏర్పాటుచేశారు. సీసీ కెమెరాలతో నిఘా ఉంచారు. పరీక్షా కేంద్రాలను కలెక్టర్ వినోద్‌కుమార్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్‌రహర్, డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.


పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టరు వినోద్‌కుమార్

అదనపు సాయం ఇళ్లపై దృష్టి పెట్టండి

● జూన్ 10లోపు నిర్మాణాలు పూర్తి చేయాలి
● ఇంజనీర్లకు హౌసింగ్ పీడీ ఆదేశాలు

అనంతపురం క్లాక్‌టవర్, మే 3(ఆంధ్రజ్యోతి): అదనపు ఆర్థిక సాయంతో నిర్మాణం చేపట్టిన ఇళ్లపై దృష్టి పెట్టాలనీ, జూన్ 10వ తేదీలోగా పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ శైలజ.. ఇంజనీర్లను ఆదేశించారు. తన చాంబర్‌లో గృహనిర్మాణాలపై హౌసింగ్ పీడీ శైలజ శనివారం సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 9,711 అసంపూర్తి ఇళ్ల లబ్ధిదారులను గుర్తించగా.. ఇప్పటి వరకు 3,790 నిర్మాణాలు పూర్తి చేశారన్నారు. జూన్ 10వ తేదీలోపు మిగిలిన 5,921 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం అదనపు సాయాన్ని ఇప్పటికే లబ్ధిదారులకు చెల్లించిందన్నారు. దీనిపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి, ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా చొరవ చూపాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేలా ప్రజల్లో అవగాహన తేవాలన్నారు. సొంత స్థలం ఉన్న పేదలు ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈలు, ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఖాద్రీశుడి ఆర్జిత కల్యాణోత్సవ తేదీలివే..

కదిరి, మే 3(ఆంధ్రజ్యోతి):ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెలలో నిర్వహించే ఆర్జిత కల్యాణోత్సవాల తేదీలను ఈఓ శ్రీనివాసరెడ్డి శనివారం ప్రకటించారు. 8, 9, 13, 14, 15, 19, 20, 21, 22, 23, 25, 28, 29, 30 తేదీల్లో ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహిస్తారు. రోజుకు నాలుగు టిక్కెట్లు విక్రయిస్తామని, టిక్కెట్ ధర రూ.6,500 అని తెలిపారు. ఒక టిక్కెట్‌పై ఐదుగురికి ప్రవేశం కల్పిస్తామని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిగ్రీలో 5,041 మంది పాస్

ఫలితాలను విడుదల చేసిన ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ అనిత

అనంతపురం సెంట్రల్, మే 3(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షల్లో 5041మంది విద్యార్థులు పాస్ అయ్యారు. ఈ మేరకు శనివారం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అనిత తన కార్యాలయంలో రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబుతో కలిసి పరీక్షా ఫలితాలను విడుదలచేశారు. అనంతరం వీసీ అనిత మాట్లాడుతూ.. బీఎస్సీ, బీకామ్, బీఏ, బీటీఏ, బీసీఏ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామన్నారు. మొత్తం 6,577 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 5,041 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఉత్తీర్ణత శాతం 76.65గా నమోదైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఫలితాల కోసం జ్ఞానభూమి పోర్టల్‌ను సందర్శించాలని సూచించారు. ఫెయిలైన విద్యార్థులు రివాల్యుయేషన్, ఫిజికల్ వెరిఫికేషన్ కోసం ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున ఈనెల 19లోపు చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు తిమ్మప్ప, శంకర్, అధికారులు మారుతి, సాయిశివ పాల్గొన్నారు.


ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ ప్రొఫెసర్ అనిత

మున్సిపల్ టీచర్ల సీనియారిటీ యథాతథంగా ఉంచాలి

● డీఈఓకు సంఘాల నేతల వినతి

అనంతపురం విద్య, మే 3(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ టీచర్ల సీనియారిటీ జాబితాను యథాతథంగా కొనసాగించాలని పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు, టీచర్లు.. డీఈఓ ప్రసాద్‌బాబును కోరారు. పాత డీఈఓ కార్యాలయంలో డీఈఓ ప్రసాద్‌బాబును ఉపాధ్యాయ సంఘాల నాయకులు రవీంద్ర, రామచంద్ర, గురుప్రసాద్, పలువురు టీచర్లు శనివారం కలిశారు. వారు మాట్లాడుతూ... అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో టీచర్ల ప్రమోషన్లలో తప్పిదాలపై కొందరు టీచర్లు గతంలోనే లోకాయుక్త, హెచ్ఆర్‌సీకి ఫిర్యాదు చేశారన్నారు. దీంతో అప్పటి మున్సిపల్ రీజనల్ డైరెక్టర్, డీఈఓ, మున్సిపల్ కమిషనర్ నిబంధనల మేరకు సీనియారిటీ జాబితాను తయారు చేశారన్నారు. 2004లో కొందరు టీచర్లు స్వార్థం కోసం అప్పటి మున్సిపల్ కమిషనర్‌ను తప్పుదోవ పట్టించి హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత ఉందనీ, డీఎస్సీ వచ్చే వరకూ ఎస్‌జీటీలకు (ఎస్సీ, ఎస్టీ, పీహెచ్) తాత్కాలికంగా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ 30శాతం కోటాలో ప్రమోషన్లు కల్పించారన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా ఇచ్చారన్నారు. 2004లో ప్రమోషన్లు పొందిన ఆ టీచర్లు సీనియారిటీ జాబితాలో చేరి 2011లో (70 శాతం కోటా) పదోన్నతుల్లో ఆ పోస్టులను అబ్జార్బ్ చేశారని పేర్కొన్నారు. తర్వాత ఇచ్చిన అనేక ప్రమోషన్లలో ఆ టీచర్ల జాయినింగ్ తేదీలను 2011 మే 1గా చూపారని గుర్తు చేశారు. ప్రస్తుతం సీనియారిటీ జాబితా తయారీ సమయంతో వాస్తవాలను గుర్తించాలన్నారు. మున్సిపల్ టీచర్ల సీనియారిటీని యథాతథంగా కొనసాగించాలని కోరారు. ఈ మేరకు డీఈఓకు వినతిపత్రం అందించారు. దీనిపై డీఈఓ స్పందిస్తూ... నిబంధనల మేరకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఎవరినీ అన్యాయం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.


డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సమాధులపై వాలిన వైసీపీ

● రాత్రికి రాత్రే శ్మశాన స్థలం చదును
● పోలీసులకు తల్లిమడుగుల గ్రామస్థుల ఫిర్యాదు


శ్మశాన స్థలాన్ని చదును చేసిన దృశ్యం

కనగానపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): అధికారం పోయినా వైసీపీ నాయకుల ఆగడాలు ఆగట్లేదు. మండలంలోని తల్లిమడుగుల గ్రామంలో శ్మశాన స్థలంపైనే కన్నేశారు. రాత్రికి రాత్రే ట్రాక్టర్లతో దున్ని చదునుచేశారు. శ్మశాన స్థలాన్ని కాపాడాలని గ్రామస్థులు శనివారం కనగానపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లిమడుగుల గ్రామ పరిధి సర్వే నంబరు 256-1లో 1.16 ఎకరాల భూమిని శ్మశానానికి కేటాయించారు. ఆ స్థలం పక్కనే వైసీపీ నాయకుడి పొలం ఉంది. ఇటీవల గ్రామస్థుల ఫిర్యాదు మేరకు సర్వే చేసిన అధికారులు శ్మశాన వాటిక స్థలానికి హద్దులు ఏర్పాటు చేసి, రాళ్లు పాతారు. అయినా.. శ్మశాన స్థలాన్ని ఆక్రమించుకునేందుకు బండి ధనుంజయ ప్రయత్నిస్తున్నాడు. బంధువులైన బిల్లే ప్రభాకర్, బండి మనోజ్ సాయంతో శ్మశాన స్థలాన్ని చదును చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని, శ్మశాన స్థలాన్ని కాపాడాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామ ప్రజలు తెలిపారు.

నేడు దళిత ఎమ్మెల్యేల అభినందన సభ

అనంతపురం విద్య, మే 3(ఆంధ్రజ్యోతి): మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం దళిత ఎమ్మెల్యేల అభినందన సభ నిర్వహించనున్నట్లు ఆ సంఘం జాతీయ అదనపు ప్రధానకార్యదర్శి బండారు శంకర్ పేర్కొన్నారు. శనివారం ఉపాధ్యాయ భవన్‌లో ఆ సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. బండారు శంకర్ మాట్లాడుతూ.. ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు మాసినేని గ్రాండ్‌లో దళిత ఎమ్మెల్యేల సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, దస్తగిరి, జయసూర్యను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు గురుకుల పాఠశాలలో ఇంటర్ ప్రవేశ పరీక్ష

రామగిరి, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలురు, బాలికల గురుకుల పాఠశాలల్లో బీసీ గురుకుల ఇంటర్ ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహించనున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ హమీనా బేగం శనివారం ప్రకటనలో తెలిపారు. నసనకోట గురుకుల పాఠశాల పరీక్షాకేంద్రంలో 479 మంది, పేరూరు పాఠశాలలో 279 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటితో పాటు వైద్యసదుపాయం కల్పించామన్నారు.

న్యూస్ బాక్స్

తల్లిని గౌరవించడం సనాతన ధర్మం

● దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి



మాతృదేవోభవ కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న స్వామీజీ

అనంతపురం కల్చరల్, మే 3(ఆంధ్రజ్యోతి): తల్లికి మించిన దైవం లేదని, మాతృమూర్తిని గౌరవించడం సనాతన ధర్మం మనకు నేర్పిన సంప్రదాయమని మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. సాయి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించనున్న మాతృ దేవోభవ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శనివారం బొమ్మేపర్తిలో స్వామీజీ చేతులమీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, సభ్యులు రాఘవేంద్ర, నారాయణనాయక్, వెంకటనారాయణ నాయుడు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్యవైశ్యులకు ఆటల పోటీలు

అనంతపురం కల్చరల్, మే 3(ఆంధ్రజ్యోతి): వాసవీమాత జయంతిని పురస్కరించుకుని కొత్తూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆర్యవైశ్య బాలబాలికలు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు గోపామచ్చా నరసింహులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విజేతలుగా నిలిచినవారికి ఈనెల 7న వాసవీ జయంతి వేడుకల్లో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

నేడు దాసరి జయంతి వేడుకలు

అనంతపురం కల్చరల్, మే 3(ఆంధ్రజ్యోతి): ఏపీ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఉమ్మడి అనంతపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ కమిటీ కోఆర్డినేటర్, సినీ రచయిత సాయి పవన్‌కుమార్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. కమలానగర్‌లోని వృద్ధాశ్రమంలో దాసరి జయంతి వేడుకలతో పాటు అన్నదానం చేస్తామన్నారు. కార్యక్రమానికి జనసేన పార్టీ కార్యనిర్వాహక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవానీ రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు.

లింగనిర్ధారణపై డెకాయ్ ఆపరేషన్ చేయండి: కలెక్టర్

అనంతపురం టౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): లింగనిర్ధారణపై డెకాయ్ ఆపరేషన్ చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో లింగనిర్ధారణ చట్టం అమలుపై శనివారం జిల్లాస్థాయి కమిటీతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. లింగనిర్ధారణపై ఫిర్యాదులు స్వీకరించే కమాండ్ కంట్రోల్‌రూమ్ పటిష్టంగా పనిచేయాలన్నారు. కర్ణాటకలోని చిత్రదుర్గం,బళ్లారి, చెళ్లికెర ప్రాంతాల అధికారులతో కలిసి డెకాయ్ ఆపరేషన్లు విస్తృతంగా చేపట్టాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ లింగనిర్ధారణకు ఆస్కారం ఇవ్వరాదన్నారు. జిల్లా వైద్యాధికారి ఈబీ దేవి, డీఎస్పీ మహబూబ్‌బాషా, రెడ్స్ భానూజ, డెమోలు త్యాగరాజు,గంగాధర్, ఆశారాణి పాల్గొన్నారు.

పెండింగ్ అంశాలపై దృష్టిపెట్టాలి

వివిధ శాఖల్లో ప్రభుత్వ పథకాల అమలులో పెండింగ్ అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. అధికారులతో ఆయన కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈకేవైసీ వందశాతం నమోదుచేయించాలన్నారు. తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. మున్సిపాలిటీల్లో ప్రతివార్డులో చలివేంద్రం ఏర్పాటుచేయించాలని సూచించారు.

మద్యం తాగి గొడవ

అనంతపురం క్రైం, మే 3(ఆంధ్రజ్యోతి): ఇద్దరు స్నేహితులు మద్యం తాగి గొడవపడగా ఒకరికి గాయాలయ్యాయి. ఫెర్రర్ నగర్‌కు చెందిన మునాఫ్, శారదానగర్‌కు చెందిన మురళి స్నేహితులు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో శారదానగర్‌లోని మద్యం దుకాణానికి వెళ్లి పక్కనున్న గదిలోనే మద్యం తాగారు. వ్యక్తిగత విషయంపై వాదులాడుకున్నారు. ఆ సమయంలో పోలీసులు సర్దిచెప్పి పంపారు. మరో సారి సాయంత్రం మరోసారి గొడవపడ్డారు. ఈ క్రమంలో మురళి దుస్తులు ఉతకడానికి ఉపయోగించే పొడిని నీటితో కలిపి మునాఫ్ మొహంపై చల్లాడు. దీంతో మునాఫ్‌కు గాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు మురళిపై కేసు నమోదు చేశారు. కాగా మురళిపై 2020లో ఎక్సైజ్ కేసు ఉంది.

వాచ్‌మన్ మృతి

అనంతపురం క్రైం, మే 3(ఆంధ్రజ్యోతి): ఓ ఇంటి నిర్మాణానికి వాచ్‌మన్‌గా ఉన్న ఓ వ్యక్తి డోర్ షీట్లు మీద పడి మృతి చెందాడు. నగర శివారులోని చంద్రబాబు కొట్టాలకు చెందిన శంకర నారాయణ(40)కళ్యాణదుర్గం రోడ్డులో ఓ ఇంటి నిర్మాణం జరుగుతుంటే వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం డోర్ కోసం కొన్ని ఉడెన్ షీట్లు తెచ్చి ఉంచారు. శుక్రవారం రాత్రి శంకరనారాయణ అక్కడే నిద్రించాడు. బరువైన డోర్ షీట్లు మీద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్‌కు సన్మానం



ముంటిమడుగు కేశవరెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన ముంటిమడుగు కేశవరెడ్డిని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడుతో కలిసి టీడీపీ నాయకులు సిమెంట్ పోలన్న, కుంచెపు వెంకటేష్ శనివారం అనంతపురం రాంనగర్‌లోని ఆయన నివాసంలో శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

భూసార పరీక్షలు తప్పక చేయించాలి

● జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ



భూసార పరీక్ష కార్డులు పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

రాప్తాడు, మే 3(ఆంధ్రజ్యోతి): రైతులందరూ తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఆమె శనివారం మండలంలోని మరూరులో రైతులకు భూసార పరీక్షల ఫలితాల కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీలు శ్రీనాథ్‌రెడ్డి, శ్రీవాణి, ఏఈఓ రంజిత, వీహెచ్‌ఏ హర్ష, విఏఏ శ్రీనివాసులు, గ్రేస్‌బాషా, ఎంపీఈఓ రాజు, నరేష్, రైతులు చెన్నకేశవులు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీచర్‌కు రాజకీయ బురద..!

● విద్యాశాఖకు తప్పుడు ఫిర్యాదులు
● అన్నీ అవాస్తవాలే: విచారణ అధికారులు



చియ్యేడు జిల్లా పరిషత్ పాఠశాల

అనంతపురం రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని చియ్యేడు పాఠశాలలో పని చేస్తున్న ఓ ఉపాధ్యాయుడిపై గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు కక్ష సాధింపులకు దిగారు. ఆ ఉపాధ్యాయుడిపై గ్రామానికి చెందిన అదే సామాజిక వర్గానికి చెందిన వారితో ఫిర్యాదు చేయించారు. ఆమేరకు క్షేత్రస్థాయిలో విద్యాశాఖ ఉన్నతాధికారులు విచారణ చేసి ఆరోపణలు అవాస్తవాలని తేల్చారు. ఉపాధ్యాయుడిపై శాఖాపరమైన చర్యలు లేకపోవడంతో స్థానిక ప్రజాప్రతినిధులు వివిధ రూపాల్లో ఇబ్బందులు పెట్టడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. సార్వత్రిక ఎన్నికల్లో ఆ ఉపాధ్యాయుడు అధికార పార్టీకి పనిచేశారన్న ఒకే ఒక్క నెపంతో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు గ్రామస్థుల్లో చర్చసాగుతోంది.

ఫిర్యాదు ఇలా..

చియ్యేడు జిల్లా పరిషత్ పాఠశాలలో బూడిద నాగేంద్ర స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆ ఉపాధ్యాయుడుపై ఈ ఏడాది జనవరిలో విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. నకిలీ సర్టిఫికెట్‌తో ఉద్యోగం పొంది, గ్రామ పాఠశాలలో పనిచేస్తున్నారని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ఆకుతోటపల్లికి చెందిన మందల చంద్రశేఖర్ అనే వ్యక్తిని బినామీగా పెట్టుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని, గ్రామంలో తకరారులో ఉన్న భూమి కొనుగోలు చేశారని ఫిర్యాదు చేశాడు. ఈయన రెస్టారెంట్ కూడా నిర్వహిస్తున్నారని, గ్రామంలో ఉపాధ్యాయుడిగా ఉంటూ తన భూములు, ఆస్తులు కాపాడుకుంటున్నారని, గ్రామంలో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

డిప్యూటీ డీఈఓ స్థాయి అధికారితో విచారణ

ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఈక్రమంలోనే డిప్యూటీ డీఈఓ స్థాయి అధికారితో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పాఠశాల, గ్రామంలో కూడా విచారణ చేశారు. ఉపాధ్యాయుడికి క్లీన్ సర్టిఫికెట్ ఇస్తూ నివేదికను కలెక్టర్‌తోపాటు జిల్లా ఉన్నతాధికారులకు అందజేశారు.

అధికార పార్టీకి పనిచేశాడని...

ఉపాధ్యాయుడు నాగేంద్రది స్వగ్రామం చియ్యేడు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు విమానయానం కల్పించాడు. ఈ ఏడాది డొక్కా సీతమ్మ అన్నదాన సత్రాన్ని వీక్షించేందుకు విహార యాత్ర పేరిట విద్యార్థులను తీసుకెళ్లారు. దీంతో గ్రామంతో పాటు, విద్యార్థులలోనూ మంచి పేరు గడించారు. పాఠశాల అభివృద్ధిలోనూ తన వంతు పాత్రపోషిస్తున్నాడు. అందుకే ఉపాధ్యాయుడిపై ఫిర్యాదుల నేపథ్యంలో ఆయనకు మద్దతుగా గ్రామస్థులు సంతకాలు చేసి కలెక్టరేట్‌లో అధికారులను కలిసి వినతి పత్రం ఇచ్చారు. కాగా ఉపాధ్యాయుడిది కూడా చియ్యేడే కావడంతో తన సామాజిక వర్గంతో మంచి సంబంధాలున్నాయి. ఇదే అతడిపై ఫిర్యాదు చేయడానికి అసలు కారణంగా తెలుస్తోంది. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి మద్దతుగా నిలిచారన్న నెపంతో స్థానిక ప్రజాప్రతినిధులు అదే సామాజిక వర్గానికి చెందిన వారితో ఫిర్యాదు చేయించినట్లు గ్రామస్థుల్లో చర్చసాగుతోంది.



ఉపాధ్యాయుడికి మద్దతుగా కలెక్టరేట్‌లో వినతి పత్రం ఇస్తున్న గ్రామస్థులు(ఫైల్)

మంచి మనసున్న వ్యక్తి సీఎం చంద్రబాబు



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందుకున్న వారితో ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి మనసున్న వ్యక్తి అని, పేదలు కష్టాల్లో ఉంటే వెంటనే స్పందిస్తారని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం 54మంది లబ్ధిదారులకు రూ. 53లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో వారు ఎవరికి ఎలాంటి ఇబ్బంది ఉన్నా..వెంటనే అందుకు సంబంధించిన బిల్లులను తీసుకొస్తే సాయం అందేలా చూస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో వైద్యం పొందుతున్న ఓ బాధితురాలి గురించి వివరించగా ఆయన వెంటనే వారికి ఎల్ఓసీ కింద రూ. 6లక్షలు చెక్కును మంజూరు చేశారన్నారు. అలాగే పార్టీ నాయకుల సమావేశంలో సభ్యత్వ నమోదు కార్డుల అంశంపై చర్చించారు. నియోజక వర్గానికి 80వేల కార్డులు వచ్చాయని, పంపిణీలో మనమే ముందు వరుసలో ఉన్నామన్నారు.

మెడికో విద్యార్థికి రూ.6లక్షల చెక్కు పంపిణీ

● ఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన మెడికో విద్యార్థి అంకె హన్సికకు మంజూరైన రూ.6లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాలసునీత ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. కర్నూలు జిల్లాలోని మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న హన్సిక ప్రమాదవశాత్తు కిందకు పడి తీవ్రంగా గాయపడింది. ఆమె హైదరాబాదులోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని టీడీపీ నాయకులు, కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎం కార్యాలయం ద్వారా తక్షణ సాయంగా రూ. 6లక్షలు మంజూరు చేయించారు. ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ, మండల కన్వీనర్ శ్రీనివాసులు, మాజీ కన్వీనర్ మనోరంజన్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షాకేంద్రాన్ని పరిశీలించిన కోఆర్డినేటర్

అనంతపురం సెంట్రల్, మే 3(ఆంధ్రజ్యోతి): నేషనల్ టెస్ట్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించినున్న నీట్ పరీక్షలకు ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఎన్‌టీయూ సిటీ కోఆర్డినేటర్ మార్కండేయులు శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రతో కలిసి పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అదేశాల మేరకు పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు మార్కెండేయులు పేర్కొన్నారు.

టీడీపీలో కష్టపడిన వారికి గుర్తింపు

● ప్రభుత్వ విప్ కాలవ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి, పరిటాల సునీత







ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు దగ్గుపాటి, పరిటాల సునీతను సన్మానిస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి, నెట్టెం వెంకటేష్

గార్లదిన్నె/బుక్కరాయసముద్రం, మే 3(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడిన వారందరికి గుర్తింపు ఉంటుందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, పరిటాల సునీత పేర్కొన్నారు. ఏడీసీసీ బ్యాంకు చైర్మన్, డీసీఎంఎస్ చైర్మన్‌గా నియమితులైన ముంటిమడుగు కేశవరెడ్డి, నెట్టెం వెంకటేష్ శనివారం కాలవ శ్రీనివాసు లు, దగ్గుపాటి ప్రసాద్, పరిటాల సునీతను నగరంలోని వారి క్యాంపు కార్యాలయాల్లో కలిశారు. శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, కార్యనిర్వహక కార్యదర్శి కాటప్పగారి రామలింగారెడ్డి, నాయకులు గంజె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

ఆత్మకూరు, మే 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పి. సిద్దరాంపురం గ్రామంలో శనివారం ఎమ్మెల్యే పరిటాల సునీత బాధితులును పరామర్శించారు. ఈ సందర్బంగా వారివారి ఇళ్లకు వెళ్లి పరామర్శించి, భరోసా కల్పించారు. రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మరణించిన చెన్నెడ్డి జయమ్మ కుటుంబ సభ్యులను, బ్రెయిన స్ట్రోక్‌తో మరణించిన వడ్డే గంగన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స తరువాత సేదతీరుతున్న ఇడుముడి సంజప్ప, మాజీ సర్పంచ్ నారాయణప్ప కుమారుడు రాధాక్రిష్ణను పరామర్శించారు. అనంతపురంలోని పాపంపేటలో నివాసముంటున్న సిద్దరాంపురం వాసి రామాంజనేయులు కుమారుడు శ్రీకాంత్ ఉద్యోగరీత్యా స్విట్జర్లాండ్‌లో ఉంటూ మూడురోజులు క్రితం గుండె పోటుతో మృతిచెందాడు. వారి నివాసానికి వెళ్లి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గుత్తి డిప్యూటీ డీఈఓగా మల్లారెడ్డి

అనంతపురం విద్య, మే 3(ఆంధ్రజ్యోతి): గుత్తి డివిజన్ డిప్యూటీ డీఈఓగా మాల్లారెడ్డి నియమితులయ్యారు. ఆయన శనివారం గుత్తి డిప్యూటీ డీఈఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇన్‌చార్జ్ డిప్యూటీ డీఈఓగా ఉన్న శ్రీదేవి ఫిబ్రవరిలో ఉద్యోగ విరమణ చేయడంతో అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉంది. ఈ క్రమంలో బెళుగుప్ప ఎంఈఓ-1 మల్లారెడ్డికి గుత్తి డిప్యూటీ డీఈఓగా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మల్లారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఆ డివిజన్‌లోని ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు, ఇతర సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

తప్పుల తడకగా డిగ్రీ ప్రశ్న పత్రం

● సరిజేసి పంపిన ఎస్కేయూ అధికారులు

అనంతపురం సెంట్రల్, మే 3(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ, లా కోర్సుల పరీక్షలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం నిర్వహించిన డిగ్రీ బీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ సెమిస్టర్ మైక్రో ఎకనామిక్స్ పరీక్షలను నిర్వహించారు. అయితే ప్రశ్నపత్రంలో తప్పులు దొర్లాయి. గమనించిన పరీక్షా కేంద్రాల అధికారులు వర్సిటీ అధికారులకు తెలిపారు. దీంతో తప్పుల ను సరిదిద్ది ప్రశ్నపత్రాన్ని తిరిగా పరీక్షా కేంద్రాలకు మెయిల్ ద్వారా పంపారు. ఈ విషయంపై వర్సిటీ అధికారులను వివరణకోరగా శనివారం ఒకరోజే 137 రకాల ప్రశ్నపత్రాలు పంపామన్నారు. సమయం తక్కువ, సిబ్బందిలేమి తదితర కారణాల రీత్యా తప్పులు దొర్లాయని వివరించారు.

డిమాండ్ల సాధనకు చైతన్య యాత్రలు

అనంతపురం విద్య, మే 3(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగుల డిమాండ్ల సాధనకు చైతన్య యాత్రలు చేపట్టబోతున్నట్లు ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు పేర్కొన్నారు. శనివారం ఆ సంఘం నాయకులు కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిశారు. తర్వాత ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాజి పఠాన్, ప్రధానకార్యదర్శి రాజేశ్వర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్న మాట్లాడుతూ.....సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ వంటిని వద్దన్నారు. మూడు డిమాండ్లతో చైతన్య యాత్ర చేపడుతామన్నారు.

వర్షానికి కూలిన చెట్లు

అనంతపురం క్రైం, మే 3(ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి నగరంలోని కొన్ని ప్రాంతాల్లో చెట్లు కూలాయి. మరికొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలకున్న వైర్లు తెగిపడ్డాయి. దీంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అధికారులు చెట్లను తొలగించారు. కొన్ని ప్రాంతాల్లో ఆలస్యం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

అప్రమత్తంగా ఉండండి: మేయర్

నగరంలో వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని నగర మేయర్ మహమ్మద్ వసీం అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షం, గాలులతో పలు ప్రాంతాల్లో చెట్లు పడిపోవడంతో ఆయా ప్రాంతాలను మేయర్ శనివారం పరిశీలించారు. విద్యుత్ స్తంభాలు, వైర్లను తొలగించి మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. డ్రైనేజీలలో వ్యర్థాలను తొలగించాలన్నారు. వర్షపునీరు ఇళ్లల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



రామ్‌నగర్‌లో ఓ ఇంటి పక్కనే కూలిన చెట్టు



కళ్యాణదుర్గం బైపాస్‌లో కూలిన చెట్టు

తాగునీటి పైపులైన్ పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): మరో రెండు మూడు నెలల్లో పైపులైన్ పనులు పూర్తి చేసి ప్రజలకు నీరందిస్తామని ఎమ్మెల్యే దగ్గపాటి ప్రసాద్ పేర్కొన్నారు. తపోవనంలోని శివాలయం వద్ద జల్ జీవన్ మిషన్ కింద తాగునీటి పైపులైన్ పనులకు ఆయన శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... జిల్లాలోని రాప్తాడు, అనంతపురం రూరల్‌తో పాటు నియోజకవర్గంలోని నాలుగు పంచాయతీలకు పీఏబీఆర్ ద్వారా తాగు నీరు అందించేందుకు రూ. 97కోట్లతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. అలాగే నగరానికి మరో 60ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్ అందుబాటులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మురళీధర్‌రావు, ఏఈ హరికుమార్, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారామ్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డిష్‌నాగరాజు, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనకు పటిష్ట చర్యలు

● ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

అనంతపురం అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాటుసారా నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. ఆయన శనివారం అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సూపరింటెండెంట్ రామమోహన్ రెడ్డితో కలిసి ఎక్సైజ్ సీఐలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నవోదయం అమలులో భాగంగా నాటుసారా నిర్మూలన కోసం ప్రజలకు అవగాహనతోపాటు పాత నేరస్థులు, అనుమానితులపై మరింత నిఘా పెంచాలన్నారు. ఏఈఎస్ రేవతి తదితరులు పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తూ సీహెచ్‌ఓల నిరసన

అనంతపురం టౌన్, మే3(ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న సీహెచ్‌ఓలు తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన కొనసాగించారు. నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం జిల్లా వైద్యశాఖ కార్యాలయం ఎదురుగా మట్టిమూకుళ్లు చేతబట్టి రోగులు, రోడ్డుపై వెళుతున్న ప్రజల వద్దకు వెళ్లి భిక్షాటన చేస్తూ నిరసన తెలియజేశారు. ల్యాబ్ టెక్నీషియన్‌ల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌బాబు, ఏఐటీయూసీ నాయకులు రాజారెడ్డి, రాజేష్‌గౌడు తదతరులు సంఘీభావం తెలిపా రు. నిరసనలో సీహెచ్‌ఓల సంఘం నాయకులు గౌరి, అనూష, రాజేశ్వరి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు జిల్లాలో రోడ్డు ప్రమాదం

● బీకేఎస్ యువకుడి దుర్మరణం

ఎమ్మిగనూరు, మే 3(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రానికి చెందిన రజాక్(35) దుర్మరణం చెందాడు. ఈయన తరచూ ఎమ్మిగనూరు పశువుల సంతలో ఎద్దుల కొమ్ములు చెక్కేందుకు (నునుపు చేయడం) వెళ్లేవాడు. ఆక్రమంలోనే కడిమెట్ల గ్రామానికి చెందిన రైతు కుంటెన్నగారి కేశన్నతో స్నేహం ఏర్పడింది. ఈనేపథ్యంలో ఆదివారం సంత కోసం రజాక్ శనివారమే ఎమ్మిగనూరుకు వచ్చాడు. అక్కడ రైతు కేశన్నను కలిశాడు. ఇద్దరూ టీ తాగి కాసేపు మాట్లాడుకున్నారు. తర్వాత మా ఊరు కడిమెట్లలో ఉన్న మా ఎద్దుల కొమ్ములు చెక్కి వద్దాం పదా అని రజాక్‌ను తీసుకుని ద్విచక్రవాహనంపై రైతు కేశన్న బయల్దేరాడు. మరో ఐదారు నిమిషాల్లో గమ్యస్థానం చేరుకుంటారనగా కర్నూలు వైపు నుంచి ఎమ్మిగనూరుకు వస్తున్న అశోక్ లైలాండ్ మినీ వాహనం వారు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఇద్దరు మిత్రులూ అక్కడికక్కడే మృతి చెందారు. కాగా రజాక్ తల తెగిపోయి దూరంగా పడిపోయింది. ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాలను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ట్రాఫిక్ పోలీసులకు టోపీల పంపిణీ

అనంతపురం రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): కాపునాడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులకు టోపీలు అందజేశారు. శనివారం కాపునాడు రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర ప్రసాద్, ఇతర కమిటీ సభ్యులు నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులకు, సిబ్బందికి టోపీలను అందించారు. కాపునాడు జిల్లా ప్రెసిడెంట్ తాడాల నాగభూషణం, గౌరవాధ్యక్షుడు రంగనాయకులు, బండారు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

'ఆర్డీటీ సేవలను కొనసాగించాలి'



ఐక్యత చాటుతున్న ఆర్డీటీ పరిరక్షణ ఫోరం నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే3(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి విదేశాల నుంచి వచ్చే నిధులను కొనసా గించాలని ఆర్డీటీ పరిరక్షణ ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఫోరంతోపాటు పలు ప్రజా, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఆర్డీటీని రక్షించే కార్యక్రమాల కోసం సమన్వయకర్తల రూపకల్పన, జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో నాయకులు మచ్చా రామలింగారెడ్డి, రవిచంద్ర, డిస్కవర్ అనిల్‌కుమార్, సందనం రవికుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు స్వామీట్ మధు, బీహెచ్ రాయుడు, ఐఎంఎం మహబూబ్ బాషా, టీపీ రెడ్డి, ఎస్సీఎస్టీ సంఘాల జేఏసీ సాకే హరి, ఆశ్రయ కృష్ణారెడ్డి, శ్రీహరిమూర్తి, పద్మజ, రామన్న, అబ్దుల్ ఆలం, రహంతుల్లా, కేపీ రాజు, టీపీ రామన్న, దాసరి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆర్డీటీని కాపాడుకుందామని దివ్యాంగులు నిరసనకు దిగారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఆంజనేయులు షఫీ, హరినాథ్‌రెడ్డి, సర్ఫున్నీసా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డీటీకి గాయాలు





ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు, గాయపడ్డ డీటీ ఇంతియాజ్

కనగానపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్లపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డిప్యూటీ తహసీల్దార్ తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఇంతియాజ్ అనంతపురం నుంచి తన కారులో బెంగళూరుకు వెళుతున్నారు. మార్గమధ్యంలో మామిళ్లపల్లి వద్ద బెంగళూరు నుంచి అనంతపురం వైపు వస్తున్న మరో కారు అదుపు తప్పింది. డివైడర్లను దాటుకుని ఎదురుగా వచ్చి డిప్యూటి తహసీల్దార్ ప్రయాణిస్తున్న కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు కార్లు దెబ్బతిన దంతో పాటు డీటీ ఇంతియాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. హైవే పెట్రోలింగ్ అంబులెన్స్ సిబ్బంది వెంటనే అక్కడికి వచ్చి గాయపడ్డ డీటీని అనంతపురంలోని ఓ ఆసుపత్రికి తరలించి చికిత్సలందించారు. కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అదే విధంగా శుక్రవారం రాత్రి విదులు ముగించుకోని అనంతపురం వెళుతున్న కనగానపల్లి తహసీల్దార్ ప్రసాద్ కారును రాప్తాడు వద్ద ఐషర్ వాహన ఢీకొంది. ఈ ప్రమాదంలో తహసీల్దార్ ప్రసాద్ గాయపడి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సలందుకున్నట్లు సిబ్బంది తెలిపారు.

తాగునీటి ఎద్దడి రానివ్వకండి

● మున్సిపల్ అధికారులకు చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి

తాడిపత్రి, మే 3(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా కూడా తాగునీటి సమస్య రానివ్వకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పట్టణంలోని తన నివాసంలో శనివారం ఆయన మున్సిపల్ అధికారులతో సమావేశమై మాట్లాడారు. గత పాలకులు తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థలను అస్తవ్యస్తం చేశారన్నారు. ఇప్పుడు వాటిని బాగుచేయాలంటే ఎంతో శ్రమతో కూడిందన్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చూడాలని సూచించారు. అలాగే అక్కడక్కడ డ్రైనేజీ సమస్య ఉన్నట్లు మా దృష్టికి వచ్చిందని, మురుగు కాలవల్లో పూడిక పేరుకుపోవడంతో మురుగునీరు ముందుకెళ్లలేక రోడ్లపై పారుతున్నట్లు తెలిసిందని అన్నారు. కాలువల్లో పూడికను వెంటనే తొలగించాలని తెలిపారు. కొద్దిరోజులకు వర్షాలు ప్రారంభం అవుతున్నాయని, వర్షపునీరు ఎక్కడ నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. తాడిపత్రి మున్సిపాలిటీలో డ్రైనేజీ, తాగునీటి సమస్యలు అనేవి ఉండరాదని సూచించారు. ఇందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఆయావార్డుల్లో పర్యటించి ఆయా సమస్యలపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, ఏఈ తేజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీపీఎం నేత రాంభూపాల్‌పై మండిపాటు..

తాడిపత్రి: మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి మద్దతుగా మాట్లాడినందుకు గాను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్‌పై జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హైకోర్టు పెద్దారెడ్డిని తాడిపత్రికి వెళ్లొచ్చని చెబితే.. అందుకు మీరు వత్తాసు పలకడం ఏమిటని రాంభూపాల్‌పై మండిపడ్డారు. నేను నా కుమారుడు జేసీ అశ్మిత్‌రెడ్డి గతంలో జైలుకు వెళ్లినప్పుడు మీ కళ్లు మూసుకుపోయాయా అని ప్రశ్నించారు. తాము నాలుగునెలలు జైలు జీవితం గడిపామని, అప్పుడు ఎందుకు మాట్లాడలేదని అన్నారు. ఇప్పుడు ఎందుకు మాట్లాడుతున్నావో చెప్పాలన్నారు. ఎంత మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందంటూ దుయ్యబట్టారు. గత ఐదేళ్లకాలంలో పెద్దారెడ్డిచేసిన అరాచకాలు అన్నీఇన్నీ కావన్నారు. ఆరోజు అతను మా ఇంటిపైకి వచ్చినప్పుడు మీరందరూ ఎక్కడకు వెళ్లారని మండిపడ్డారు. మా అనుచరుడు పొట్టిరవిని జిల్లానుంచి బహిష్కరించారన్నారు. అనంతరం తాడిపత్రికి వెళ్లొచ్చని హైకోర్టు నుంచి ఆర్డర్‌లు వచ్చినా పెద్దారెడ్డి తన తొత్తు అయిన డీఎస్పీ చైతన్యను అడ్డుపెట్టుకుని ఏదోఒక చాకు చెప్పి ఊరిలోకి రానీయకుండా పంపించడం మరిచిపోయావా అంటూ విరుచుకుపడ్డారు. గతంలో పెద్దారెడ్డి ఏ పార్టీ వచ్చినా ఫ్యాక్షన్ చేస్తానని అన్నప్పుడు ఎందుకు స్పందించలేదని రాంభూపాల్‌పై ఆక్రోశం చెందారు. నేను తలచుకుంటే నీ ఆస్తి చిట్టా బయటకు తీస్తానని, కానీ నాకు విలువలు ఉన్నాయని, దిగజారుడు రాజకీయాలు చేయనని చెప్పారు. మాటలు మాట్లాడేటప్పుడు చూసి జాగ్రత్తగా మాట్లాడాలని హితవు పలికారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



ర్యాలీలో పాల్గొన్న ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు

గుంతకల్లు టౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ, ఆటో యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో శనివారం ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటో ర్యాలీ నిర్వహించారు. మస్తానయ్య దర్గా నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎన్టీఆర్ సర్కిల్ వరకు కొనసాగింది. అనంతరం ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ డిగ్రీలు, పీజీలు చదివినా ఉద్యోగాల రాకపోవడంతో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నమన్నారు. ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. అలాగే ఇన్సూరెన్స్ భారాన్ని తగ్గించాలని, ఎఫ్‌సీని గుంతకల్లులోనే కొనసాగించాలని, పోలీసుల వేధింపులు ఆపాలని అన్నారు. ఈనెల 20వ తేదీన జరిగే దేశ వ్యాప్త సమ్మెను కార్మికులందరూ వచ్చి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ యూనియన్ గౌరవ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసులు, ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, ఈశ్వరయ్య, హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మహేష్, ఆటో డ్రైవర్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు అంజి , నాయకులు, ఆటోడ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడదాం

గుంతకల్లు టౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడదామని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ. సురేష్ పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం ఆయన పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల ఆటో స్టాండ్, కసాపురం రోడ్డులోని ఆటో స్టాండ్, భగత్‌సింగ్ కాలనీ, రామిరెడ్డి కాలనీలో కార్మిక జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల హక్కులను కేంద్రప్రభుత్వం కాలరాస్తోందన్నారు. లేబర్ కోడ్‌ల పేరుతో ఉన్న హక్కులను రద్దుపరిచి కార్పొరేట్ కంపెనీలకు, పెట్టుబడిదారులకు అనుకూలమైన లేబర్ కోడ్‌లను తీసుకొస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా అందరం పోరాడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓపీడీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, నాయకులు రఘునాథ్‌రెడ్డి, రామాంజినేయులు, జిలాన్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర్ల కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించండి



పయ్యావుల శ్రీనివాసులును కలిసిన వడెర్ల సంఘం నాయకులు

ఉరవకొండ, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉరవకొండ మేజర్‌పంచాయతీ పరిధిలో వడ్డెర్ల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని వడ్డెర సంఘం నాయకులు టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులను కోరారు. జిల్లాకేంద్రంలోని రాంనగర్‌లో శనివారం వారు ఆయ న్ను కలిసి మాట్లాడారు. అన్ని కులాల కమ్యూనిటీ హాళ్లకు నిధులు కేటాయించారని, వడ్డెర్ల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కూడా స్థలంతో పాటు, నిధులు కేటాయించాలని విన్నవించారు. ఇందుకు స్పందించిన పయ్యావుల శ్రీనివాసులు ఈ విషయమై మంత్రి కేశవ్‌తో చర్చిస్తానని చెప్పినట్లు సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, లాల్‌స్వామి, సంజీవరాయుడు, శివ, శంకరయ్య, శివరుద్ర పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతికి నివాళి



భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, మే 3(ఆంధ్రజ్యోతి): పెద్దపప్పూరు మండలం తబ్జుల గ్రామానికి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కృష్ణకుమారి భర్త, టీడీపీ సీనియర్ నాయకుడు నాగేశ్వరరెడ్డి గుండెపోటుతో గత శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో మృతిచెందాడు. ఆయన భౌతికకాయాన్ని శనివారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ వచ్చి సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి వెంట నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఆర్డీటీ సెట్ కొనసాగేలా చూడండి

తాడిపత్రి, మే 3(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సెట్ రద్దుచేయడం వల్ల తమకు తీవ్రనష్టం వాటిల్లిందని కొంతమంది పేద విద్యార్థులు ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. పట్టణంలోని నివాసంలో శనివారం వారు ఎమ్మెల్యేను కలిసి మాట్లాడారు. నియోజకవర్గపరంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి 500పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రముఖ విద్యాసంస్థల్లో ఉన్నత చదువులు చదవడానికి ఆర్డీటీ సెట్ ఎంతో ఉపయోగకరంగా ఉండేదన్నారు. ప్రస్తుతం రద్దు చేయడంతో ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. పేదవిద్యార్థులకు ఎంతో ఉపయోగపడే ఆర్డీటీ సెట్ కొనసాగేలా చూడాలని కోరారు. ప్రత్యేక చొరవచూపి ఈ మేరకు ప్రభుత్వంతో మాట్లాడాలని విన్నవించారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలి

గుత్తి, మే 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పేదల అభ్యున్నతికి ఎంతో పాటు పడుతున్న ఆర్డీటీకి కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలని పట్టణంలోని ఆ సంస్థ సభ్యులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక గాంధీ సర్కిల్‌లో శనివారం నిరసన చేపట్టారు. పలువురు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో పేదలకు పెన్నిధిగా ఆర్డీటీ చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. అలాంటి సంస్థకు నిధులు రాకుండా చేయడం తగదన్నారు. కేంద్రప్రభుత్వం వెంటనే ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధంచాలని డిమాండ్ చేశారు. సంస్థ సభ్యులు ఓబులేసు, రామాంజినేయులు, కార్తీక్, సీపీఐ మండల కార్యదర్శి రామదాసు, మల్లికార్జున, రాము, తిరుపాల్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో హైడ్రేషన్ డ్రైవ్

గుంతకల్లు, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దక్షిణమధ్య రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వారు శనివారం ఉదయం స్థానిక రైల్వే స్టేషన్‌లో హైడ్రేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం సభ్యులు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లతో కలిసి రైలు ప్రయాణికులకు ఉచితంగా తాగునీరు, జ్యూస్, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. రైళ్లలో, ప్లాట్‌ఫారాలపై ఉన్న ప్రయాణికులను కలిసి వేసవిలో డీహైడ్రేషన్‌కు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బెంగళూరుకు వెళ్లి పింఛన్ అందజేత



సుశీలమ్మకు పింఛన్ అందజేస్తున్న సచివాలయ ఉద్యోగి

గుత్తి, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 12వ వార్డుకు చెందిన సుశీలమ్మ అనే పింఛన్ లబ్ధిదారురాలు బెంగళూరులో ఆసుపత్రిలో ఉండగా. సచివాలయ ఉద్యోగి రఫీ శనివారం అక్కడికే వెళ్లి పింఛన్ అందజేశారు. గత రెండునెలలుగా ఆమె ఆనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో అప్పటి నుంచి ఆమె పింఛన్ తీసుకోలేదు. మూడో నెల కూడా తీసుకోకపోతే పింఛన్ నిలిచిపోతుందని సచివాలయ ఉద్యోగి బెంగళూరుకు వెళ్లి ఆమెకు రూ.12వేల పింఛన్ మొత్తాన్ని అందజేశారు. ఇందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : టీడీపీ



సమావేశంలో పాల్గొన్న క్రైస్తవులు, టీడీపీ నాయకులు

గుంతకల్లు, మే 3(ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి పేర్కొన్నారు. పట్టణంలోని అంజలీనగర్‌లో గల చర్చిలో గురువారం పాస్టర్ల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా గుమ్మనూరు నారాయణ స్వామి, టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు పాల్గొన్నారు. నారాయణస్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వం పాస్టర్లకు ఏడు నెలల వేతనాన్ని విడుదల చేయడం హర్షణీయమన్నారు. సీఎం చంద్రబాబు క్రైస్తవుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. అనంతరం పాస్టర్లు వేతనాలను విడుదల చేసినందుకు థ్యాంక్యూ సీఎం సార్ అనే బ్యానర్‌ను ప్రదర్శిస్తూ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీఎస్ కృష్ణారెడ్డి, తలారి మస్తానప్ప, ప్రభాకర్, పాస్టర్లు రూబెన్ , సోలమన్ విజయరాజు, జయపాల్, బిషప్ అనిల్ వాసుకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి నూతన డిప్యూటీ డీఈఓగా మల్లారెడ్డి



అనంతపురం విద్య, మే 3 (ఆంధ్రజ్యోతి): గుత్తి డివిజన్ డిప్యూటీ డీఈఓగా మల్లారెడ్డి నియమితులయ్యారు. ఆయన శనివారం గుత్తి డిప్యూటీ డీఈఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇన్‌చార్జ్ డిప్యూటీ డీఈఓగా ఉన్న శ్రీదేవి ఫిబ్రవరిలో రిటైర్డ్ అవడంతో అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉంది. ఈ క్రమంలో జిల్లా విద్యాశాఖాధికారులు అర్హులైన ఎనిమిది మంది ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుల జాబితాను ఇటీవలే కమిషనర్‌కు పంపారు. అయితే అందులో మొదటి స్థానంలో ఉన్న ఓ హెచ్‌ఎంపై ఇటీవలే ఆర్‌జేడీ ఛార్జెస్ ఫ్రేమ్ చేశారు. దీంతో ఆయనను పక్కనబెట్టారు. దీంతో జాబితాలో రెండో స్థానంలో ఉన్న బెళుగుప్ప ఎంఈఓ-1 మల్లారెడ్డికి గుత్తి డిప్యూటీ డీఈఓగా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మల్లారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఆ డివిజన్‌లోని పలువురు ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు, ఇతర సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని వినతి

తాడిపత్రి, మే 3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్, సీఐటీయూ నాయకులు శనివారం సీడీపీఓ సాజిదాబేగంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఉమాగౌడ్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం 29కార్మిక చట్టాలను రద్దుచేసి 4లేబర్‌కోడ్‌లను ప్రవేశపెట్టిందన్నారు. ఈ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించడంతోపాటు గ్రాట్యుటీ, జీఓ 8ని మార్పు చేయాలన్నారు. పెన్షన్, ఈపీఎఫ్ అమలుచేయాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీఓను ఇవ్వాలని డిమాండ్‌చేశారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో అందరూ పాల్గొనాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ సెక్టార్ లీడర్స్ శంకరమ్మ, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు బచ్చనకల్లేశ్వరపట్టపు దేవర

కణేకల్లు, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనకనహాళ్ గ్రామంలో ఆదివారం బచ్చనకల్లేశ్వర పట్టపు దేవర నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం ప్రకటనలో తెలిపారు. 24 ఏళ్ల తర్వాత జరిపే ఈ దేవర బ్యాళ్ల గోత్రానికి చెందిన వంశస్థుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జరగనున్నట్లు చెప్పారు. ఈ దేవరకు కర్ణాటక నుంచి సైతం భక్తులు భారీగా తరలిరానున్నట్లు చెప్పారు.

టీతాగుతూ కుప్పకూలి వ్యక్తి మృతి

గుత్తి,మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ హోటల్ వద్ద శనివారం టీతాగుతూ సాయినాథ్(34) అనే వ్యక్తి ఉన్న ఫలంగా కుప్పకూలి మృతిచెందాడు. స్థానిక బీసీ కాలనీకి చెందిన సాయినాథ్ తన స్నేహితులతో కలిసి అనంతపురం రోడ్డులో ఓహోటల్ వద్దకు వెళ్లాడు. అక్కడ టీ తాగుతూ ఉన్నఫలంగా కిందపడ్డాడు. వెంటనే స్నేహితులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని చెప్పారు.

చికిత్స పొందుతూ మరొకరు..

తాడిపత్రి, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గ వద్ద గత శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కిరణ్‌కుమార్ (50) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అనంతపురంలోని ఉమానగర్‌కు చెందిన కిరణ్‌కుమార్ తన కుమార్తెను చూడడానికి నంద్యాలజిల్లా అంకిరెడ్డిపల్లికి బైక్‌లో వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత తిరిగి స్వగ్రామానికి బయలు దేరాడు. అయితే బుగ్గవద్ద స్పీడ్‌బ్రేకర్‌ను ఎక్కడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. వెంటనే స్థానికులు తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందు తూ మృతి చెందాడని సీఐ తెలిపారు. అతడికి భార్య శివమ్మ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రేషన్ డీలర్‌పై చర్యలు

బెళుగుప్ప, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని నాలుగో రేషన్ షాపునకు చెందిన డీలర్ పట్ల లబ్ధిదారుల నుంచి నుంచి ఫిర్యాదులు అందడంతో చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ షర్మిల శనివారం తెలిపారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. గత మార్చి 18వ తేదీన విచారించి నివేదికలు పంపడంతో చర్యలు తీసుకున్నామన్నారు. ఈ డీలర్ నుంచి నిత్యావసర సరుకులతో పాటు ఈ మిషన్‌ను స్వాధీనం చేసుకుని ఎస్సీ కాలనీకి చెందిన అంగడి మాధవికి స్టోర్ నిర్వహణ బాధ్యతలు అప్పజెప్పినట్లు చెప్పారు.

చిత్రలేఖనం పోటీలు

తాడిపత్రి, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయంలో గల వేసవి శిక్షణ శిబిరంలో శనివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి రవికుమార్‌నాయుడు తెలిపారు. చిత్రలేఖనం పోటీల అనంతరం రిసోర్స్‌పర్సన్ రాంబాబు, విశ్రాంత ఉపాధ్యాయుడు వీరారెడ్డి చేత విద్యార్థులకు కథలు చెప్పించడం, పుస్తకపఠనం చేయించడం, పద్యాలు చెప్పడం తదితర వాటిని నేర్పించామన్నారు. అనంతరం పిల్లలు పాటలు పాడడం, డ్యాన్స్ చేయడం జరిగిందని చెప్పారు.

సచివాలయం తనిఖీ

యల్లనూరు, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకాయమంద సచివాలయాన్ని ఎంపీడీఓ వాసుదేవరెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఉపాధి పనులను తనిఖీ చేసి కూలీల మస్టర్లను పరిశీలించారు. పనిచేసే చోటే హాజరువేయాలని మేట్లకు సూచించారు.

5 నుంచి ఆధార్ క్యాంప్‌లు

పుట్లూరు, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 5 నుంచి 15వ తేదీ వరకు మొబైల్ ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ శనివారం ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8వ తేదీల్లో పుట్లూరు, కడవకల్లు, 12, 13వ తేదీల్లో బాలాపురం, అరకటవేముల, 14, 15వ తేదీల్లో తక్కళ్లపల్లి, అరకటవేముల గ్రామాల్లో ఆధార్‌క్యాంపులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి మొబైల్ క్యాంపులో వంద సర్వీసులు తగ్గకుండా చేయాలని ఎంపీడీఓ సిబ్బందిని ఆదేశించారు.

● శెట్టూరు: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఈ నెల 5, 6, 7, 8, 12, 13, 14, 15వ తేదీలలో ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రఘురామారావు ప్రకటనలో తెలిపారు. ఐదు కల్లు, చిన్నంపల్లి, బచ్చేహళ్లి, చింతర్లపల్లి గ్రామాలలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లక్ష్మీనరసింహాలయంలో చోరీ


పుట్లూరు, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుగుచింతలపల్లి గ్రామ శివారులో గల తంబుర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడ్డారని, స్వామివారికి అలంకరించిన సుమారు రూ.19 వేలు విలువ గల వెండిని గలను ఎత్తుకెళ్లారని గ్రామస్థులు తెలిపారు. విషయం తెలుసుకున్న సీఐ సత్యబాబు, ఎస్ఐ వెంకటనరసింహం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

బెళుగుప్ప, మే 3 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో భారతీయ యాత్రికులపై ఉగ్రవాదులు చేసిన దాడిని నిరసిస్తూ మండలకేంద్రంలో యువకులు శనివారం ర్యాలీ చేశారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రేషన్ డీలర్ శివ, శివరుద్ర, బాబు రెడ్డి, భీమన్న, అశోక్, తిప్పయ్య పాల్గొన్నారు.

విమాన ప్రయాణం.. మధురానుభూతి


● ఆనందం వ్యక్తం చేసిన విద్యార్థినులు
● ఎంఈఓకు రుణపడి ఉంటామని వెల్లడి



హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ గార్డెన్‌ను తిలకిస్తున్న ఎంఈఓ, విద్యార్థినులు

బెళుగుప్ప, మే 3(ఆంధ్రజ్యోతి): విద్యలో ప్రతిభ కనబరచి విమానంలో ప్రయాణించడం మధురానుభూతిని కలిగించిందని, ఈ అవకాశం కల్పించిన ఎంఈవో మల్లారెడ్డి సార్‌కు రుణపడి వుంటామని విద్యార్థినిలు పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పదో తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థినులను ఎంఈఓ మల్లారెడ్డి సొంత ఖర్చులతో హైదరాబాద్ వరకు విమాన ప్రయాణం చేయించిన విషయం విధితమే. ప్రయాణం ముగించుకుని ఆ విద్యార్థులు శనివారం స్వగ్రామానికి చేరుకున్నారు.


విమానంలో ప్రయాణిస్తానని ఊహించలేదు..



విమాన ప్రయాణం చేస్తానని ఊహించలేదు. విమాన ప్రయాణంతో పాటు హైదరాబాద్‌లో చారిత్రాత్మక ప్రదేశాలు సందర్శించే అవకాశం కలిగింది. మెట్రో ట్రైన్, ఎన్టీఆర్ గార్డెన్, చార్మినార్‌ను చూశాం. ఎంఈఓ మల్లారెడ్డి సార్‌కు రుణపడి వుంటాం.

- ఇందు, ఎర్రగుడి

విమాన ప్రయాణం థ్రిల్లే వేరు



విమాన ప్రయాణం మరువలేనిది. ఆ థ్రిల్లే వేరు. మల్లారెడ్డి సార్ మాకుపదవ తరగతికే మంచి అవకాశం కల్పించారు. సార్ ప్రోత్సాహం ఉన్నత చదువుల్లో కూడా మంచి ప్రతిభ సాధించాలన్న ఆసక్తి కలిగించింది. ఎవరికీ రాని అవకాశం మాకు వచ్చింది. ఇది ఎంతో అదృష్టంగా భావిస్తున్నా.

- మధు శ్రీ, బెళుగుప్ప

నేమకల్లు అంజన్నకు ప్రత్యేక పూజలు



వెండి కవచ అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే ఆలయంలోని మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, వెండి కవచం, విశేష పుష్పాలకంరణ చేశారు. అతర్వాత అష్టోత్తర పూజలు చేసి నైవేద్యం సమర్పించి మంగళహారతి ఇచ్చారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించారు.

ఘనంగా పత్రికా స్వేచ్ఛ దినోత్సవం

గుంతకల్లుటౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ పత్రిక స్వేచ్ఛ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వన్‌టౌన్, టూటౌన్ సీఐలు బీ.మనోహర్, ఏపీ మస్తాన్, న్యాయవాది నాగరాజు, ఆ నలుగురు సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1993లో ఐక్యరాజసమితి ప్రధాన అసెంబ్లీ మే 3న ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం ప్రకటించిందన్నారు. అనంతరం పాత్రికేయులు అతిథులకు శాలువాలు, పూలమాలలతో సన్మానం చేశారు. ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడు జీ.మహమ్మద్ రఫీ, ప్రింట్ మీడియా అధ్యక్షుడు శేషగిరి, కార్యదర్శి బోయ వెంకటరాముడు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, కోశాధికారి కల్యాణ్‌కారి రమేష్‌బాబు, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ పాఠశాలకు నేషనల్ లెవల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న పాఠశాల కరెస్పాండెంట్

గుంతకల్లు టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): నేషనల్ లెవల్ శిక్ష అవార్డుకు పట్టణంలోని విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఎంపికైంది. హైదరాబాద్‌లో శనివారం సాయంత్రం ఈ అవార్డును అందుకున్నట్లు పాఠశాల కరెస్పాండెంట్ శ్రీనివాసు లు తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో లీడ్ క్రూక్స్ ప్రోగాంను దేశ వ్యాప్తంగా 9వేల పాఠశాలల్లో నిర్వహించారని, అందులో ప్రతిభ చూపిన 20పాఠశాలలను అవార్డుకు ఎంపిక చేశారని, వాటిల్లో తమ పాఠశాల ఉందని అన్నారు. లీడ్ క్రూక్స్ ప్రోగాం సీఈఓ సుమీత్ మెహతా చేతుల మీదుగా నేషనల్ విన్నర్ అవార్డును అందుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చిత్ర, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

గుత్తి రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి) :మండలంలోని కరిడికొండ గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కర్ణాటక రాష్ట్రం బెంగుళూరుకు చెందిన అవినాష్ అనే వ్యకి హైదరాబాద్‌కు బైక్‌పై బయలుదేరాడు. కరిడికొండ గ్రామశివారులోకి రాగానే బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మండల సమావేశంలో సమస్యలపై నిలదీత

రాయదుర్గం, మే 3(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ విద్యావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో పలువురు సభ్యులు గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా జుంజురంపల్లి, వడ్రవన్నూరు, ఆవులదట్ల, చదం గొల్లలదొడ్డి తదితర గ్రామాల్లో సచివాలయాలు, విలేజ్ క్లీనిక్‌లు రైతు సేవ కేంద్రాల భవనాల నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో అక్కడి ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై అధికారులు ఎందుకు స్పందించడం లేదని సర్పంచులు అశోక్, వన్నూరుస్వామి నిలదీశారు. ఇందుకు ఎంపీడీఓ కొండయ్య మాట్లాడుతూ త్వరలోనే నిర్మాణాలు పూర్తిచేసి ఉద్యోగులకు సరైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, డ్రైనేజీ సమస్యలు తీర్చాలని సర్పంచ్‌లు కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అరుణ్‌కుమార్, తహసీల్దార్ నాగరాజు, ఏఓ మహేంద్ర, పశువైద్యుడు సూర్యనారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరినాయక్, పీఆర్ జేఈ మునిస్వామి, పీహెచ్‌సీ వైద్యుడు మాధవ మోహన్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

రాయదుర్గం, మే 3(ఆంధ్రజ్యోతి): ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కొట్రేష్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. యువత హక్కుల సాధన కోసం ఏఐవైఎఫ్ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో తాలూకా కార్యదర్శి కుమార్‌నాయక్, జిల్లా సమితి సభ్యులు నాగయ్య, గంగాధర్, దివాకర్, ప్రశాంత్ కిషోర్, రామాంజి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లకు అభినందనలు



ఎన్‌సీసీ కేడెట్లను అభినందిస్తున్న దృశ్యం

రాయదుర్గం, మే 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఐదుగురు ఎన్‌సీసీ కేడెట్లు కర్నూలులో ఇటీవల జరిగిన ఇంటర్ డైరెక్టరేట్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి తెలిపారు. ఇందుకు కళాశాలలో శనివారం సమావేశం ఏర్పాటు చేసి ప్రతిభ కనబరిచిన అరవింద్, వంశీ, ఆసియా భాను, గౌతమి, లీలావతిని అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఎన్‌సీసీ ఏఎన్‌ఓ కిరణ్‌జక్కుల, ఎన్ఎస్ఎస్ పీఓడీ నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలూరులో ఏఎస్పీ పర్యటన



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఏఎస్పీ

తాడిపత్రి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఫ్యాక్షన్ గ్రామమైన ఆలూరులో ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు చేశారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామంలో ఏమైనా సమస్యలు వస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. అంతేకానీ వాటిని పెద్దవి చేసుకోరాదన్నారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోరాదన్నారు. అందరూ కలిసి మెలిసి జీవించాలని, పిల్లల్ని ఉన్నత చదువులు చదివించుకోవాలని సూచించారు. ఫ్యాక్షనిజానికి దూరంగా ఉండాలన్నారు. గతంలో ఫ్యాక్షన్ వల్ల ఎందరికో.. ఎంతో నష్టం జరిగిందని, అలాంటివి పునరావృతం కాకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ శివగంగాధర్ రెడ్డి, ఎస్ఐ ధరణీబాబు, సిబ్బంది పాల్గొన్నారు.